సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 22 । జూలై । 2024



విశాఖ జట్టు విజయకేతనం
కడప వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కృష్ణాపై విశాఖ విజయం సాధించింది. -8లో



ప్రగతి రైలు పట్టాలెక్కేనా!
జిల్లాలో రైల్వేల ప్రగతి విషయంలో ఎన్డీఏ ప్రభుతవం ఈసారైనా న్యాయం చేస్తుందా అని ప్రయాణికులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.8/24.8
జిల్లాలో ఆదివారం 24.8 - 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 08562-244437 అనే ల్యాండ్‌లైన్ నెంబరుకు ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలు విన్నవించుకోవాలన్నారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న డ్రోన్ వర్క్‌షాప్

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కడప ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాదుకు చెందిన డ్రోనికా ఎన్నోవేషన్స్ సంస్థ ఉమ్మడిగా ఈ నెల 24 బుధవారం కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయంలో డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారని ఏపీవీడబ్ల్యూఏ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తామని, డ్రోన్ సర్వే నిర్వహణ, త్రీడీ మ్యాపింగ్, డ్రోన్ మ్యాపింగ్, వ్యాపార అవకాశాలు, వినియోగంలో ఉన్న నమూనాలు తదితర అంశాలపై ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంస్థ కడప నగర అధ్యక్షులు సి.శివశంకర్‌రెడ్డి (98669 34793), నగర కార్యదర్శి పి.శివరామకృష్ణ (94414 02970)ను సంప్రదించాలని సూచించారు.

వైవీయూ వీసీని తొలగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: తీవ్ర లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణా రెడ్డిని వైవీయూ ఇన్‌చార్జ్ వీసీగా నియమించడం సిగ్గు చేటని తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోనిహోచిమిన్ భవన్‌లో ఆయన మాట్లాడారు. యోగి వేమన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా కృష్ణారెడ్డి నియామకాన్ని రద్దు చేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ వీసీగా నియామకమైన కృష్ణా రెడ్డి గతంలో కృష్ణ యూనివర్సిటీలో అవినీతి, లైంగిక ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యారని పేర్కొన్నారు. యోగి వేమన యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా ఉండి కూడా తన వైఖరి మార్చుకోలేదని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివశంకర్, నగర అధ్యక్షుడు అరుణ్ , శివ తేజపాల్గొన్నారు

కోదండరామాలయంలో గిరిప్రదక్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం నుంచి ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు 14 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షణ నిర్వహించారు. పెద్దకొత్తపల్లి, చిన్నకొత్తపల్లి, గంగన్న చెరువు, రాచగుడిపల్లి, రాచపల్లి, సాలాబాదు, మలకాటిపల్లి మీదుగా తిరిగి ఒంటిమిట్ట రామాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తం రాజు, లాయర్ సుధామణి, బీజేపీ నాయకులు పాటూరు గంగిరెడ్డి, డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నంది, గరుడ వాహనాలపై శివ, కేశవులు

రాజంపేట: తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సిద్ధేశ్వరస్వామి నంది వాహనంపై, శ్రీ చెన్నకేశవస్వామి గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పల్లకీ సేవ నిర్వహించారు.ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రాధ, గాయత్రి, ఎల్లయ్య, రమణయ్య, శ్రీదేవి, లీలావతి, యశోద, కృష్ణ బృందాల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

- తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 22న ఒకే వేదికపై శివ, కేశవుల కల్యాణం నిర్వహించనున్నారు.రాత్రి స్వామి వార్లు గజవాహనంపై ఊరేగనున్నారు.

శాకంబరీ..మనసాస్మరామీ



రాయచోటి టౌన్: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని రకరకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. శనివారం రాత్రి10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అభిషేకాలు జరిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు.అమ్మా..కరుణించమ్మా అంటూ వేడుకున్నారు. అనంతరం అమ్మవారి అలంకరణ నుంచి తొలిగించిన కూరగాయలు, పండ్లు, కాయలను భక్తులకు పంచిపెట్టారు. ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి పాల్గొన్నారు.

భవితకు నవోదయం

- ప్రణాళికతో సిద్ధమైతే సీటు గ్యారంటీ
- 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు తుది గడువు సెప్టెంబర్ 16



విద్యాలయంలోని డార్మెటరీ



మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం

మదనపల్లె సిటీ: గ్రామీణ విద్యార్థులకు మంచి ప్రమాణాలు కలిగిన విద్యను అందించడంతో పాటు జాతీయ సమైక్యతకు కృషి చేయడం వంటి ఆశయాలతో ఏర్పాటైందే జవహర్ నవోదయ విద్యాలయం. 6 నుంచి 12 వ తరగతి వరకు సీబీఎస్ఈ విద్యతో పాటు హాస్టల్ వసతి ఉంటుంది. జిల్లాలో మదనపల్లె పట్టణ సమీపంలోని వలసపల్లెలో నవోదయ విద్యాలయం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు నవోదయలో సీటు రావాలని కలలు కంటారు. 100 మార్కులకు దాదాపు 90 మార్కులు పైనే సాధిస్తేనే సీటు దొరికే అవకాశం ఉంటుంది. నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నవోదయ విద్యాలయం,శిక్షణ, ప్రవేశానికి అర్హతలు, పరీక్ష విధానం తదితర అంశాలపై ప్రత్యేక కథనం.....

- కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. 6 నుంచి 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి 7 వరకు ప్రాంతీయ, మాతృభాషల్లో బోధన సాగుతోంది. గణితం, సైన్స్ పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో చెబుతున్నారు.పదో తరగతి వరకు సెంట్రల్‌బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)ను అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

2025-26 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. https:/ navodaya. gov. in, https:// cbseitms. rcil. gov. in/ nvs/ వెబ్‌సైట్స్‌ను దర్శించాలి. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి అనుమతిస్తారు. సమయం కేటాయించి ప్రణాళికబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

- మదనపల్లె సమీపంలోని చిత్తూరు రోడ్డులో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 6వ తరగతి 80 సీట్లకు ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు విధించారు.వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రాజంపేటలో నవోదయ విద్యాలయం ఉంది. ఈ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఉమ్మడి కడప జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

రిజర్వేషన్ విధానం...

6వ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నిర్దేశించారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో వరుసగా 3,4 తరగతి చదివి అదే పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న వారు అర్హులు. విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 1.5.2013 నుండి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలి. 3,4 తరగతులు 5వ తరగతి చదువున్న పాఠశాలలు ప్రభుత్వ, ఎయిడెడ్, గుర్తింపు పొందివుండాలి.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన...

నవోదయలో ఉమ్మడి జిల్లాల వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

సౌకర్యాల కల్పన

మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక సముదాయాలు కొలువుదీరాయి. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో వృక్షాలతో అలరాలుతోంది. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం వ్యాయామశాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతుల కొనసాగిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు కొలువుదీరాయి. గ్రంథాలయంలో నవోదయ విద్యాలయం వనరుల కేంద్రంగా ఉంది.



కంప్యూటర్ పాఠశాలలో నవోదయ విద్యార్థులు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇదో సదవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా ప్రవేశం పొందవచ్చు.
-గోవిందరావు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, మదనపల్లె

పరిశోధనల కోసం ఇస్రో సహకారం

- ఎన్ఏఆర్ఎల్ ప్రతినిధులతో వీసీ సమావేశం



ఎన్ఏఆర్ఎల్ ప్రతినిధులతో సమావేశమైన వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అధునాతన పరిశోధనా కార్యక్రమాల కోసం ఇస్రోతో సహకారం కోరినట్లు యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దాని అనుబంధ సంస్థలతో పరిశోధన సహకారాల కోసం నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ (ఎన్ఏఆర్ఎల్) డైరెక్టర్ డా ప్రబీర్ కుమార్, క్లౌడ్స్ అండ్ కన్వెక్టివ్ సిస్టమ్స్ గ్రూప్ గ్రూప్ హెడ్ డాక్టర్ టి. నారాయణరావు, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత డాక్టర్ వెంకటరత్నంతో తిరుపతిలో వైవీయూ వీసీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చర్చల ద్వారా వర్షపు చినుకుల పరిమాణాన్ని, వెలాసిటీని తెలిపే రూ. 30 లక్షల విలువ చేసే పరిశోధన పరికరాన్ని ఎన్ఏఆర్ఎల్ యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. వాతావరణం, పర్యావరణ అధ్యయనాలపై దశాబ్దకాలం పాటు క్రియాశీల పరిశోధన సహకారాన్ని ప్రకటించారని ఆచార్య కృష్ణారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ సంస్థతో మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) చేసుకోనున్నట్లు ఆయన చెప్పారు. వర్షపాతం, ఉరుములు, మెరుపులు, తుపానులు, రుతుపవనాల ఉష్ణప్రసరణ తో సహా ప్రకృతి వైపరీత్యాల గురించి ఖచ్చితమైన అంచనా చేయవచ్చన్నారు. భవిష్యత్తు కోసం నైపుణ్యం కలిగిన పరిశోధకులను సిద్ధం చేయడం కోసం ఈ ఎంఓయూ ఒక ముఖ్య మైన దశను సూచిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

గండికోట అభివృద్ధికి కృషి



గండికోట జుమ్మా మసీదు వద్ద కలెక్టర్ శివశంకర్

కలెక్టర్ శివశంకర్

జమ్మలమడుగు/కడప కల్చరల్: పర్యాటక కేంద్రమైన గండికోటకు ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం కృషి చేస్తామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన గండికోటను సందర్శించారు. ఈ సందర్భంగా జుమ్మా మసీదు, మాధవరాయ స్వామి ఆలయం, రంగనాథస్వామి కల్యాణ మండపంతో పాటు గండికోట పెన్నా లోయ, పెన్నా వ్యూపాయింట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పర్యాటకులకు ఎటువంటి సౌకర్యాలు ఉన్నాయో తిరిగి పరిశీలించారు. అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్2.0 ప్రాజెక్టులో భాగంగా గండికోట అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. రోప్‌వే పనుల్లో వేగం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని సూచించారు.ఆర్డీఓ శ్రీనివాస్, రామ్‌కుమార్, సర్వేయర్ హరి పాల్గొన్నారు.

తేరు కదిలె..భక్తులు మురిసె

వైభవంగా సౌమ్యనాథుని రథోత్సవం

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు సునీల్ శర్మ బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి రథాన్ని తిరుమల-తిరుపతి దేవస్థానం వారు ముందుకు కదిలించారు. భక్తుల గోవింద నామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మన్నూరు సీఐ మంజునాథ రెడ్డి, నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

- రాత్రి అశ్వవాహనంపై శ్రీ సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో విహరించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, నటుడు, దర్శకుడు తోట వేణుగోపాల్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి రెడ్డయ్య, బోయలు, భక్తులు పాల్గొన్నారు.
- రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత జీఎం నాయుడు ఆధ్వర్యంలో రథోత్సవానికి విచ్చేసిన దాదాపు 2 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నలందా కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఏఓ శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం....

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

నేటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ షురూ

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార స్వామిగుప్తా తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈనెల 11న రాష్ట్రంలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి అధికారులు ఎంపిక జాబితా విడుదల చేశారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ కి సంబంధించి ఈనెల 22, 23 తేదీలలో ఎంపికైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఈనెల 24, 25 తేదీలలో ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియకు కావలసిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కాగా ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ విద్యా బోధనలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణం, నాణ్యమైన ఉత్తమ విద్యాబోధన, క్రమశిక్షణ, ఉత్తమ సామాజిక స్పృహ ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ సొంతం. విద్యతో పాటు విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి ఒకేషనల్ కోర్సులు ఇక్కడ ప్రత్యేక వీటిల్లో నిత్యం ప్రత్యేకత. వీటిల్లో నిత్యం అధ్యాపక బృందాలు శిక్షణ ఇస్తారు.

రెండ్రోజుల్లో 1,100 మందికి కౌన్సెలింగ్

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా రెండు రోజుల్లో 1100 మందికి కౌన్సెలింగ్ నిర్వ హించనున్నారు.



ట్రిపుల్ ఐటీ ప్రవేశ ద్వారం



అడ్మిషన్ల ప్రక్రియ ఏర్పాట్లపై చర్చిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

అభ్యర్థులందరికీ ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్ లెటర్లు, వారి మొబైల్స్‌కు సందేశాలు పంపించారు.

కౌన్సెలింగ్ కు అవసరమైనవి

పదోతరగతి హాల్ టికెట్, పదో తరగతి గ్రేడ్ షీట్, పదో తరగతి టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ (4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), మీసేవా కేంద్రం నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, ఈ ఏడాది ఏప్రిల్ తరువాత మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, అభ్యర్థి, అతని తల్లిదండ్రుల రెండు పాసుపోర్టు ఫొటోలు, రేషన్ కార్డు, అభ్యర్థి ఆధార్ కార్డు,విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు లోన్ అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్, ఆధార్, ఓటర్ ఐడీ కార్డు అందజేయాలి.

ట్రిపుల్ ఐటీ ప్రత్యేకతలు

- ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ విద్యలో మొదటి రెండు సంవత్సరాలు ఇంటర్ కు సమానమైన పీయూసీ కోర్సును, తరువాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు.
- ట్రిపుల్ ఐటీలో చేరిన తరువాత విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు (పీయూసీ) ఏడాదికి రూ.45 వేలు, తరువాత నాలుగేళ్లు (ఇంజినీరింగ్) ఏడాదికి రూ.50 వేలు చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం చెల్లించిన నగదుపోను మిగిలిన సొమ్మును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని సబ్జెక్టులకు ప్రతినెల పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్ 24 వారాలు ఉంటుంది. వేసవి సెలవులు 3 వారాలు మాత్రమే ఉంటాయి. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు జరుగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. పీయూసీలో ఆరు సబ్జెక్టులుంటాయి. ఆంగ్లం (రెండు పేపర్లు), గణితం(రెండు పేపర్లు), భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, తెలుగు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులుంటాయి.
- సెలవు రోజులలో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో గడపడానికి అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితులలో పిల్లలను అవసరమైతే ఇళ్లకు పంపుతారు. ఇచ్చిన గడువులోగా రాకపోతే ఫైన్ విధిస్తారు.
- విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికి ట్రిపుల్ ఐటీ ఆవరణలోనే 30 పడకల ఆసుపత్రి గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.
- రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.1000, చెల్లించాలి. ఎస్సీ,ఎస్టీలు రూ.500 చెల్లించాలి. రీఫండబుల్ క్యాష్ ఆన్ డిపాజిట్ కింద ప్రతి అభ్యర్థి రూ. 2వేలు అడ్మిషన్ సమయంలో చెల్లించాలి.

ఈవీఎంలను నిషేధించాలి

- ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమ పోస్టర్ల ఆవిష్కరణ



ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంగటి మనోహర్ తదితరులు

కడప రూరల్: ప్రపంచ దేశాలు వినియోగించని ఈవీఎంలను నిషేధించి, ప్రజాస్వామ్యంను గెలిపించే బ్యాలెట్ పేపర్ విధానాన్ని కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సా ర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్ మాట్లాడుతూ ఈవీఎంలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నా యని తెలిపారు. ప్రపంచ దేశాలు సైతం ఈవీఎంలను నిషేధించాయన్నారు. మన దేశంలో కూడా బ్యాలెట్ పేపర్ విధానంను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాష్ట్రపతితో పాటు సుప్రీం కోర్టు, భారత ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల నిర్వహణ విధానానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడుతున్నట్లు వెల్లడించారు. కాగా హైదరాబాద్ వేదికగా ఈ నెల 21న తలపెట్టిన 'ఈవీఎం వ్యతిరేక జా తీయ ఉద్యమం'కార్యక్రమం వాయిదా వేశామ న్నా రు. చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షు లు అవ్వారు మల్లికార్జున, ఎస్సీ, ఎస్టీ మానవ హక్కుల వేదిక నాయకులు రమణ మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ హుమేర, అభ్యుదయవాది వైయం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కమలాపురం రైల్వే మార్గంలో నాగర్‌సోల్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకి తెలిసిన వారు రైల్వే పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నాగరాజు నాయక్ 98499 35863 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి రైల్వేగేటు సమీపంలో ఈనెల 18న మోటార్ సైకిల్‌పై వస్తున్న చింతకొమ్మదిన్నె మండలం పెద్దముసల్‌రెడ్డిపల్లెకు చెందిన ఇందిరెడ్డి బాలకృష్ణారెడ్డిని, గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకు దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన సమీప బంధువులకు, తనకు ఓ స్థలం విషయమై గొడవ ఉందని, వారు ఏమైనా తనపై దాడి చేయించారా విచారించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

సెంట్రింగ్ రేకులు చోరీ

కొండాపురం : మండల పరిధిలోని పెంజిఅనంతపురం గ్రామ సమీపంలోని కడప– తాడిపత్రి జాతీయ రహదారిలో నాలుగు రోడ్ల నిర్మాణానికి సంబంధించిన కాంక్రీట్‌కు ఉపయోగించే సెంట్రింగ్ రేకులు చోరీ జరిగినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. ఈనెల 19 వ తేదీన 20 సెంట్రింగ్ రేకులు గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్ : అసెంబ్లీ, పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో సంఘం నగర నగర అధ్యక్షుడు నవీన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంగా అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లాకు ప్రభుత్వ రంగ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పార్లమెంటు సాక్షిగా నాడు నరేంద్ర మోడీ హామీ ఇచ్చారన్నారు. కానీ 10 సంవత్సరాల కాలం గడిచినా కడప ఉక్కు పరిశ్రమను అతీగతీ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ బి.నారాయణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని భూ కబ్జాలపై విచారణ చేపట్టాలని భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ బి.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ కబ్జాలపై అఖిలపక్ష నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు లక్షా 50 వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలకు స్వల్ప అస్వస్థత

మదనపల్లె : చోరీ కేసులో మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్‌లో ఉంటున్న వాసు, పవన్‌కుమార్‌లకు శనివారం రాత్రి జ్వరంగా ఉండటంతో సిప్రోఫ్లాక్సిన్ (యాంటీబయాటిక్) మాత్రలు మింగారు. యాంటీబయాటిక్ మాత్రలు వారి వంటికి సరిపోకపోవడంతో శరీరంపై దద్దుర్లు వచ్చాయి. దీంతో జైలు అధికారులు వారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారు కోలుకోవడంతో తిరిగి సబ్‌జైలుకు తరలించారు.

ప్రగతి రైలు పట్టాలెక్కేనా!

- కడప–బెంగళూరు రైలుమార్గానికి దక్కని నిధుల కేటాయింపు
- కృష్ణపట్నం రైల్వేలైనులో ప్యాసింజర్ రైలు కూత పెట్టేదెప్పుడు
- 23న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై ఆశలు



రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేల ప్రగతి విషయంలో ఎన్‌డీఏ సర్కారు ఈ సారైనా న్యాయం చేస్తుందా అని ప్రయాణికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మోదీ సర్కారు ఈనెల 23న వర్షాకాలపు బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తోంది. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిబడ్జెట్ కావడంతో జిల్లా వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారు.

ఓబులవారిపల్లి–కృష్ణపట్నం లైనున్నా రైలేదీ!

రూ.6,660 కోట్లతో ఓబులవారిపల్లి–కృష్ణపట్నం రైల్వేలైను అందుబాటులోకి వచ్చింది. 2019 సెప్టెంబరు1న రైలును ప్రారంభించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఈ మార్గంలో ప్యాసింజర్‌రైలును నడిపించలేదు. కర్నూలు, నంద్యాల, కడప, నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, నెల్లూరు మీదుగా రైలు ప్రయాణాలు కొనసాగించేందుకు వీలవుతుంది. ఈ విధమైన ప్రతిపాదనలను రైల్వే అధికారులు చేయడం లేదు.

సర్వేకే పరిమితమైన రైలుమార్గాలు

జిల్లాలో ఇప్పటికి రైలుకూతకు నోచుకోని మార్గాలు అనేకం ఉన్నాయి. రాయచోటి, పులివెందుల, బద్వేలు, మైదుకూరు ఇందులో ప్రధానమైనవి. అలాగే గిద్దలూరు–భాకరాపేట , ప్రొద్దుటూరు–కంభం, ముద్దనూరు–ముదిగుబ్బ రైలుమార్గాలు సర్వేకే పరిమితమయ్యాయి.

ప్రధాన రైలుమార్గమైనా...

ముంబయి–చెన్నై ప్రధాన రైలుమార్గం పేరుకే. కానీ రైళ్లు అరకొరే. వందేభారత్, అమృత్‌భారత్ లాంటి రైళ్లు ఈ మార్గంలో నడిపించరు. కోస్తా రైలుమార్గాలకు ఉన్న ప్రాధాన్యం ఈ రైలుమార్గానికి లేదన్న అపవాదును కేంద్రరైల్వేమంత్రిత్వశాఖ మూటగట్టుకుంది.

కొత్తరైళ్లు వేయండి ప్రభో..

- జిల్లామీదుగా బెంగళూరుకు వెళ్లేందుకు రైలొక్కటి కూడా లేదు. కడప–బెంగళూరు రైల్వేలైను నిర్మాణంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బెంగళూరు–తిరుపతి మధ్య నడిచే 16220 (చామరాజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్) నంబరు రైలును కడప వరకు పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.
- గుత్తి–రేణిగుంట రైలుమార్గంలో గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం కలిగించే ప్రతిపాదనలు ఏవీ పట్టాలెక్కడంలేదు. ఉదయం తిరుపతి వైపు, సాయంత్రం కడప వైపు ఒక ప్యాసింజర్ రైలు నడిపించే ప్రతిపాదన చేయాలని ప్రయాణికులు ఎప్పటినుంచో కోరుతున్నారు.
- తిరుపతి–విజయవాడకు జిల్లా మీదుగా ఎర్రగుంట్ల–నంద్యాల మీదుగా నడిపించే విధంగా కొత్తరైలును ప్రవేశపెట్టాలని, అది రాత్రి తిరుపతి నుంచి బయలుదేరి ఉదయం విజయవాడకు చేరుకునేలా ఉండాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

కడప–బెంగళూరు రైల్వేలైను ముందుకెళ్లేదెప్పుడో..

కడప–బెంగళూరు మధ్య రైలు నిర్మాణానికి 2010 సెప్టెంబరులో అప్పటి రైల్వేశాఖ మంత్రి మునియప్ప శ్రీకారం చుట్టారు. ఈ రైలుమార్గానికి 2008–2009 బడ్జెట్‌లో ఆమోదం లభించింది. రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో రైలుమార్గం నిర్మాణ పనులు కదిలాయి. 258 కిలోమీటర్ల మేర రైలుమార్గం నిర్మాణానికి 1, 531 ఎకరాల భూసేకరణతో ఐదేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పుడు ఈ లక్ష్యం ఐదేళ్లు కాదు కదా..15యేళ్లు దాటిపోయేటట్లు కనిపిస్తోంది. భూసేకరణకు రూ.199.2కోట్లు కేటాయించారు. కడప–బెంగళూరు రైలుమార్గం నాలుగు దశల్లో నిర్మాణం చేపట్టేలా రైల్వే శాఖ నిర్ణయించుకుంది. మొదటి దశలో రూ.153కోట్లు కేటాయింపులు జరిగాయి. భూసేకరణకు సంబంధించి రూ.89కోట్లలో రూ.20కోట్లు రైల్వే వ్యయం చేసింది. ఈ దశలో 21.8 కిలోమీటర్ల వరకు చేపట్టారు. కడప నుంచి గంగనపల్లె, పెండ్లిమర్రి వరకు చేపట్టారు. 311.84 ఎకరాల భూమిని సేకరించారు. 54 చిన్నబ్రిడ్జిలు, ఆరుపెద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. పెండ్లిమర్రి లైను వేశారు. అక్కడితో లైను ఆగిపోయింది. ఈ లైను పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం వాటాను ఇవ్వాల్సి ఉంటుంది.

నందలూరు రైల్వేపై శీతకన్ను

బ్రిటీషుకాలం నుంచి వైభవంగా వెలుగొందిన నందలూరు రైల్వేకేంద్రం ఇప్పుడు నిర్వీర్యంగా మారుతోంది. ఈ క్రమంలో నందలూరుకు సంబంధించి వివిధ అంశాలపై పరిశీలన చేసి, సమగ్ర నివేదికలు ఇవ్వాలని దక్షిణమధ్యరైల్వే అధికారులకు రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. గతంలో రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లోహిత్‌ను కలిసి నందలూరు రైల్వేకేంద్రం పూర్వవైభవం, ఇప్పుడున్న పరిస్థితులను వివరించడంతో ఈ విషయంలో రైల్వేబోర్డులో ఎట్టకేలకు కదిలిక వచ్చింది. ఆ తర్వాత ఎన్నికల సమయం రావడంతో అటకెక్కింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

బడ్జెట్‌పై నమ్మకం లేదు



బడ్జెట్‌లో నందలూరు రైల్వేకి న్యాయం జరుగుతుందని నమ్మకంలేదు. పెద్దల సభలో అప్పటి మంత్రి లాలూ ప్రసాద్‌యాదవ్ నందలూరు స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్‌లో ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమ ఏర్పాటు ప్రకటన చేశారు. కానీ అది అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం నందలూరు వాసులను మోసం చేసిందనే చెప్పవచ్చు.

– సి.రవీంద్రరాజు, జెకేపీఎస్ సలహాదారుడు, నందలూరు

ఎప్పుడూ నిరాశే



ఎన్‌డీఏ ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చినా ప్రతిసారి కేంద్రబడ్జెట్‌లో రైల్వేపరంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైల్వేలకు మొండి చెయ్యే మిగులుతోంది. జిల్లా ప్రయాణికులను నిరాశపరచడమే పనిగా మారింది. నందలూరు రైల్వేకి పూర్వవైభవం కోసం తొలిసారిగా గళం విప్పిన ఎంపీ ఎవరైనా ఉన్నారంటే పీవీ మిథున్‌రెడ్డి ఒక్కరే.

– తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ మాజీ సభ్యుడు, రైల్వేకోడూరు

తరచూ సీమకు అన్యాయం



ప్రధాని మోదీ సర్కారు మూడుసార్లు అధికారంలోకి వచ్చినా రాయలసీమ రైల్వేలకు అన్యాయం జరిగింది. జిల్లా మీదుగా అనేక రైళ్లకు కరోనా ముందు హాల్టింగ్ ఉండేది. ఇప్పుడు అవి ఎత్తేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి బడ్జెట్ లోనైనా కొత్తరైళ్లు, కేటాయింపులు ఉంటాయని ఆశిద్దాం.

– కేఎంఎల్.నరసింహులు, అధ్యక్షుడు, రాయలసీమ ప్రజాసమితి

పుష్పగిరిని సందర్శించిన అన్నమయ్య వారసులు



పుష్పగిరి ఆలయాలను దర్శించుకుంటున్న తాళ్లపాక స్వామి

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని తాళ్లపాక అన్నమాచార్యుల 12 వ తరం వారసులు హరి నారాయణాచార్యులు (తాళ్లపాక స్వామి) ఆదివారం సందర్శించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆయన తన సతీమణితో కలిసి పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంతో పాటు రాజ్య లక్ష్మీ అమ్మవారు, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. అద్భుతమైన శ్రీ చెన్నకేశవ మూర్తిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తాళ్లపాక స్వామి పేర్కొన్నారు.

పుష్పగిరి ప్రదర్శన

పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో భారీ అగ్ని ప్రమాదం

- పూర్తిగా కాలిపోయిన నూతన భవనం
- రికార్డులన్నీ బూడిద



సబ్ కలెక్టరేట్‌లో ఎగసిపడుతున్న మంటలు

(మదనపల్లె) బి.కొత్తకోట: మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఆదివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు కార్యాలయం మొత్తం వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. రాత్రి 11:22 గంటలకు సబ్ కలెక్టరేట్ నూతన భవనంలో మంటలు వ్యాపించడం వాచ్‌మెన్ గమనించాడు. ఈ విషయాన్ని ఆర్డీఓ సీసీ మణికి తెలియజేశాడు. మణి అగ్నిమాపక కార్యాలయానికి 11:44 గంటలకు సమాచారం ఇవ్వగా సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. కార్యాలయంలో మంటలు అదుపు చేసేందుకు సమయం పట్టింది. సోమవారం తెల్లవారుజాము రెండు గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే ఉన్నారు. ఈ అగ్ని ప్రమాదంతో సబ్ కలెక్టర్‌లోని రికార్డులన్నీ పూర్తిగా కాలిపోయాయి. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన రికార్డులకు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి శివప్ప చెప్పారు. ఈ కార్యాలయంలోనే ఆర్డీఓ ఛాంబర్ ఉంది. ఏఓ ఛాంబర్ సహా, వివిధ విభాగాల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుంటారు. అన్ని విభాగాలకు సంబంధించిన ఛాంబర్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.1.2 కోట్లు ఉంటుందని అగ్నిమాపక అధికారి శివప్ప ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రమాదంపై ఆయన సాక్షితో మాట్లాడుతూ అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది నిర్ధారణకు రాలేదని చెప్పారు. షార్ట్ సర్క్యూట్ అయ్యిందా లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అన్నది సోమవారం పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

విశాఖ జట్టు విజయకేతనం



రాజారెడ్డి స్టేడియంలో తలపడుతున్న సౌత్‌జోన్, నార్త్‌జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. జట్టులోని యువన్ 105 బంతుల్లో 19 ఫోర్లు, 6 సిక్సర్లతో 152 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ గీత్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 41.2 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని నిశ్చయ్ 29 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు పార్థసారథి 5, యశ్వంత్ 4 వికెట్లు తీశాడు. దీంతో విశాఖ జట్టు 167 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

సెంట్రల్‌జోన్ విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, రెస్టాఫ్ సెంట్రల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 37 ఓవర్లలో 221 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె. ఆనంద్ 36 పరుగులు చేశాడు. కడప బౌలర్లు రణధీర్‌రెడ్డి 3, నాగకుల్లాయప్ప 3, ధీరజ్ కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. జట్టులోని సాయి చేతన్‌రెడ్డి 64 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్ మహబూబ్ 2 వికెట్లు తీశాడు. దీంతో సెంట్రల్‌జోన్ జట్టు 4 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.



152 పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ యువన్



5 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ పార్థసారథి

నార్త్‌జోన్ విజయం..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సౌత్‌జోన్, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 48.1 ఓవర్లలో 205 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ 42 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 3, హమీద్ 2, బాలాజీ 2, మోహన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 41.5 ఓవర్లలో 169 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వెంకటలోకేష్ 38 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ ప్రద్న్యేష్‌సాయి 3, లోహిత్ 3 వికెట్లు తీశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 36 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

బండలాగుడు పోటీల్లో రంగారెడ్డి జిల్లా ఎద్దులు ఫస్ట్



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బయపురెడ్డి తదితరులు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ బయపురెడ్డి ఆదివారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రసన్నరెడ్డి ఎద్దులు 3033 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా నారాయణపురానికి చెందిన మహబూబ్‌బాషా ఎద్దులు 2659 అడుగులు లాగి రెండో స్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దులు 2642 అడుగులు లాగి మూడో స్థానంలో, వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన వెంకటేష్ యాదవ్ ఎద్దులు 2529 అడుగులు లాగి 4వ స్థానంలో నిలిచాయి. వరుసగా పది స్థానాల వరకు గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి



ప్రసాద్ రెడ్డి మృతదేహం

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ రెడ్డి (46) అనే పాల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పెండ్లిమర్రి మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి కడప పట్టణంలో నివసిస్తూ పాల వ్యాపారం చేస్తున్నాడు. ఇందులో భాగంగా ప్రతి రోజూ వల్లూరు మండలంలోని కొప్పోలుతో పాటు మరి కొన్ని గ్రామాల్లో పాడి రైతుల నుంచి పాలు సేకరించేవాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున యధావిధిగా పాల సేకరణ కోసం కడప నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. సత్యా గ్రీన్ సిటీ సమీపంలో అతడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. కాగా మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు జయప్రదం చేయండి



స్వర్ణోత్సవ సభల కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆవిర్భవించిన యూటీఎఫ్ 50 వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో డిసెంబర్ నెలలో నాలుగు రోజులపాటు కాకినాడలో విద్యా వైజ్ఞానిక సదస్సులతో స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్ పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం అలుపెరుగని పోరాటాలు చేసిందని భవిష్యత్తులో కూడా అదే ఉద్యమ స్ఫూర్తితో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, గోపీనాథ్, కృష్ణారెడ్డి, పోతురాజు చంద్రశేఖర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో శతాబ్దం నుంచే సీమలో బౌద్ధం



ఉమ్మడి కడప జిల్లాలో బౌద్ధ ఆరామాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : రాయలసీమ ప్రాంతంలో రెండవ శతాబ్దంలోనే బౌద్ధం విలసిల్లిందని, అప్పట్లోనే పలువురు ప్రజలు బౌద్ధాన్ని ఆచరించారని, కులాల ప్రసక్తి లేకుండా జీవించారని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు పిళ్లా కుమారస్వామి రచించిన 'ఉమ్మడి కడప జిల్లాలో బౌద్ధ ఆరామాలు'అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన చరిత్ర గురించి మనం తెలుసుకోకుంటే నూతన చరిత్రను సృష్టించలేమన్నారు. డాక్టర్ అమీర్, అశోక్‌కుమార్, రాబర్ట్ హార్ట్ రాయలసీమలో పర్యటించినప్పుడు రాసిన వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. జిల్లాలోని ఘనమైన చారిత్రక వారసత్వ సంపదను వెలుగులోకి తెచ్చి పరిరక్షించి భావితరాలకు అందించేందుకు ఇంటాక్ చేస్తున్న కృషిని వివరించారు. అందులో భాగంగా మన చరిత బులెటిన్‌ను తీసుకు వస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ రేనాటి సీమ ఒకప్పుడు ప్రసిద్ధ జనపదమని, నందలూరు, ఖాజీపేట, జమ్మలమడుగు, దానవులపాడు, పుష్పగిరి, తాళ్లపాకలలో బౌద్ధం విరాజిల్లిందన్నారు. అయితే చారిత్రక వాస్తవాలను తోసి రాజని అక్కడున్న బౌద్ధ పాదాలను విష్ణు పాదాలుగా భావిస్తున్నారని తెలిపారు. బౌద్ధ స్థూపాలను ధ్వంసం చేస్తున్నారని, ఇటుకలను తవ్వేస్తున్నారని, దీంతో చారిత్రక సత్యాలు మరుగున పడి మనకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, యూటీఎఫ్ నాయకులు మహేష్, బుద్ధిస్ట్ కల్చర్ సొసైటీ కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లేల భాస్కర్, ఇంటాక్ సభ్యులు రాణి, కృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యుడు వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.